సాక్షి మంచిర్యాల

శనివారం । 29 । ఏప్రిల్ । 2023

I



నవోదయ పిలుస్తోంది..!
నవోదయ ప్రవేశ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం 5,920 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

IIలో▸



సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన
మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 30న సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్ జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్ లో ఏర్పాటు చేయనున్నట్లు సేంద్రియ ఉత్పత్తిదారుల సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం వైశ్యభవన్ లో వారు మాట్లాడారు. మామిడిపండ్లు, బియ్యం, పప్పులు, కారం, గానుగనూనెలు, నెయ్యి, తేనే, బెల్లం తదితర ఉత్పత్తులు ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
34.0 /24.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తరం దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సమ్మర్ వెకేషన్ జడ్జిల నియామకం

మంచిర్యాలక్రైం: వేసవి సెలవుల్లో భాగంగా జిల్లా న్యాయస్థానంలో విడతల వారీగా బాధ్యతలు నిర్వర్తించేందుకు ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా కోర్టులో మొదటి దశలో మే 1 నుంచి 16 వరకు కుమురంభీం జిల్లా జడ్జి ఏంవీ రమేష్ సేవలు అందిస్తారు. మే 17 నుంచి 31 వరకు మంచిర్యాల జిల్లా జడ్జి బి.సత్తయ్య సేవలు అందిస్తారని ఉన్నత న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వుల్లో పేర్కొంది.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఎంఎల్‌హెచ్‌పీవోలు గ్రామాల్లోనే ఉండి సమయపాలన పాటించాలని, గర్భిణుల వివరాలు వందశాతం నమోదు చేయాలని, వారికి అన్ని వైద్య పరీక్షలు చేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లాలోని ఉప కేంద్రాల్లో పని చేస్తున్న మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, సూపర్‌వైజర్లకు శుక్రవారం జిల్లా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు ఆరోగ్య కేంద్రాల్లోనే తప్పనిసరిగా ప్రసవాలు చేయాలని, అసంక్రమణ వ్యాధులను గుర్తించి మందులు అందజేయాలని తెలిపారు. అసంక్రమణ వ్యాధులైన బీపీ, డయాబెటిస్, క్యాన్సర్‌లను గుర్తించి మందులు, అవగాహన కలిగించాలని తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయపూర్ణిమ, సీహెచ్‌వో లింగారెడ్డి, వెంకట్, చారి, సునిల్, జిల్లా మాస్ మీ డియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.


విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కన్వీనర్ సికిందర్ అన్నారు. శుక్రవారం పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంటు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని మంచిర్యాలలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి అవసరమైన బడ్జెట్ కేటాయించకుండా నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు జూపాక శ్రీనివాస్, రమేష్, రవితేజ్, శశికుమార్ పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



డాక్యుమెంట్లు అందజేస్తున్న రామారావు

కోటపల్లి/చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట: మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ రామారావు అన్నారు. శుక్రవారం కోటపల్లి మండలం బోప్పారం, పంగిడిసోమారం, చెన్నూర్ మండలం సంకారం, బుద్దారం, లక్సెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామాల్లో బ్రాంచ్ పోస్టాఫీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నమొత్తాల పొదుపు, ఎస్బీ, ఆర్‌డీ ఎస్ఎస్ఏ, ఆర్‌పీఎల్ఐ వంటి ఖాతాలు తెరిచి ఎక్కువ మొత్తంలో వడ్డీ పొందవచ్చని వివరించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు సతీశ్, మొగిలి రజిత, చెడంక పున్నం, సిబ్బంది రాజు, ఎస్‌పీఎం శ్రీనివాస్, ఇంచార్జి బీపీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎంవోలు మహేష్, క్రాంతి, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ పాల్గొన్నారు.

పల్లెపై సమ్మె పోటు !

- నిరవధిక సమ్మెలోకి జేపీఎస్‌లు
- గ్రామాల్లో అభివృద్ధిపై ప్రభావం



మంచిర్యాల ఐబీ చౌరస్తాలో జేపీఎస్, ఓపీఎస్‌ల నిరసన దీక్ష

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గ్రామ పంచాయతీల్లో కీలకమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) నిరవధిక సమ్మె బాట పట్టడంతో పల్లెల్లో అభివృద్ధిపై ప్రభావం పడనుంది. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కొంతకాలంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోనూ శుక్రవారం నుంచి తమ విధులకు దూరంగా ఉంటూ నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రధాన డిమాండ్‌గా నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తవడంతో ఉద్యోగ క్రమబద్ధీకరణ చేయాలని కోరుతున్నారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రతిష్టాత్మకమైన పథకాలు, అభివృద్ధి పనులపై ప్రభావం చూపనుంది. ప్రభుత్వం సైతం జిల్లా పంచాయతీ ఉన్నతాధికారుల నుంచి సమ్మె విరమింపజేసే ప్రయత్నాలు చేస్తోంది. కానీ సమ్మె విరమణకు ముందుకు రాకపోవడంతో ప్రత్యామ్నాయంగా గ్రామాల్లో పనులకు ఆటంకం కలగకుండా చూసేందుకు ఏర్పాట్లు చేసే అవకాశం ఉంది.

గ్రామాల్లో అభివృద్ధిపై ప్రభావం

జిల్లాలో 310 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 51 మంది రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు మినహాయిస్తే, 218మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఇందులో 41మంది అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రతీ గ్రామ పంచాయతీకి అంటే జనాభా, విస్తీర్ణంతో తేడా లేకుండా అన్ని చోట్ల నియామకాలు చేపట్టింది. దీంతో ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. వీటిలో పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత, వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, పంచాయతీ ఆస్తుల నిర్వహణ, పన్నుల వసూళ్లు, జనన, మరణ ధ్రువీకరణలు తదితర అనేక రాష్ట్ర పథకాల అమల్లో కీలకంగా మారారు. వీటితోపాటు గ్రామ పాలనలో కీలకమైన గ్రామసభ నిర్వహణ, బడ్జెట్‌లో ముఖ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీటితోపాటు రోజువారీగా డీఎస్సార్(డెయిలీ శానిటేషన్ రిపోర్టు) ఇస్తున్నారు. ప్రతీ రోజు ఉదయమే పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో శానిటేషన్ పరిస్థితిపై నివేదికలు పంపిస్తున్నారు. ప్రతీ శుక్రవారం పచ్చదనం పరిరక్షణ కోసం గ్రీన్ డే, గురువారం అంగవాడీ కేంద్రాలను సందర్శించి బరువు తక్కువ పిల్లల పోషణ పర్యవేక్షించాలి. గతంలో కోవిడ్ సమయంలో, జిల్లాలో పోడు పట్టాల సర్వేల్లోనూ పాల్గొన్నారు.

అధికార గ్రూప్‌ల నుంచి వైదొలగి..

జేపీఎస్‌లు ప్రభుత్వ తీరుకు నిరసనగా ఇప్పటికే శాఖ పరంగా రోజువారీగా నిర్వహించే అధికార వాట్సాప్, టెలిగ్రాం గ్రూప్‌ల నుంచి వైదొలిగారు. రోజువారీగా ఆన్‌లైన్ నివేదికలు, రిపోర్టులు ఉన్నతాధికారులకు చేరవేయడం ఆగిపోయింది. కొన్ని చోట్ల పంచాయతీ మండల అధికారులు సెక్రెటరీలను సమ్మె విరమించాలని, విధుల్లోకి రావాలని కోరుతున్నప్పటికీ వెనక్కి తగ్గకపోవడంతో సమ్మె ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో జేపీఎస్‌లు సమ్మె విరమిస్తారా? లేక ప్రభుత్వం నుంచి అనుకూల ప్రకటన విడుదల చేస్తుందా? తెలియడం లేదు. గ్రామాల్లో మాత్రం సెక్రెటరీల సమ్మెతో రోజువారీ విధులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది.

నిరవధిక దీక్షలు ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో జేపీఎస్, ఓపీఎస్‌లు నిరవధిక దీక్ష చేపట్టారు. జిల్లాలోని హాజీపూర్, కన్నెపల్లి, బెల్లంపల్లి, భీమారం, మందమర్రి, వేమనపల్లి, నెన్నెల మండలాల జేపీఎస్, ఓపీఎస్‌లు ప్లకార్డులతో సామూహిక దీక్షలో కూర్చున్నారు. జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని, ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జేపీఎస్‌ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు విధులు బహిష్కరిస్తూ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని, మండల కేంద్రాల్లోనూ దీక్షలు సాగుతున్నాయని తెలిపారు.

అకాల వర్షం.. రైతులు ఆగమాగం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేలరాలిన వరిపంట, మొక్కజొన్న



బుద్ధిపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: అకాల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతూ ఆగమాగం అవుతున్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కవర్లు కప్పుకుంటూ ధాన్యం రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. నీటిలో కొట్టుకుపోయింది. దీంతోపాటు కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. వరి ధాన్యం గింజలు నేలరాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయాల్సి అధికారులు ఆలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అకాల వర్షాలతో ఇప్పటికే 3 వేల ఎకరాల వరకు పంటకు నష్టం వాటిల్లింది. నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని కోరుతున్నారు.

వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో..

కొన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, ప్రారంభించిన చోట వెంటనే తూకం వేసిన ధాన్యం తరలించాలని అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. రాస్తారోకోలు, ధర్నాలు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అయినా ధాన్యం సేకరణ నత్తనడక సాగుతోంది. ఇప్పటివరకు వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి తూకం కోసం ఎదురు చూస్తున్నారు. మరికొందరు రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసుకునేందుకు స్థలం లేక పంట కోత ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్ మండలాల్లో ఈ నెల మొదటి వారం నుంచి ధాన్యం దిగుబడి వచ్చి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. దీంతో వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతోంది.

అధికారుల ప్రత్యామ్నాయ చర్యలు

- జేపీఎస్, ఓపీఎస్‌లతో డీపీవో భేటీ
- సమ్మె కొనసాగిస్తామంటూ తేల్చిచెప్పిన వైనం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జేపీఎస్, ఓపీఎస్‌ల నిరవధిక దీక్షల విరమణకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొదటి రోజు దీక్షలో పాల్గొన్న జేపీఎస్, ఓపీఎస్‌లకు జిల్లా పంచాయతీ కార్యాలయం(డీపీవో) నుంచి పిలుపు వచ్చింది. జిల్లా కేంద్రంలో పాల్గొన్న హాజీపూర్, కన్నెపల్లి, బెల్లంపల్లి, భీమారం, మందమర్రి, వేమనపల్లి, నెన్నెల మండలాల జేపీఎస్, ఓపీఎస్‌లు రాత్రి డీపీఓతో భేటీ కాగా చర్చలు జరిగినట్లు సమాచారం. వెంటనే విధుల్లో చేరాలని లేనిపక్షంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతామని చెప్పినట్లు తెలిసింది. రెగ్యులర్ కార్యదర్శులతోపాటు ఎంపీడీఓ కార్యాలయంలోని సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని నియమించి గ్రామాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనుల పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. కాగా, నిరవధిక సమ్మెను ఎట్టి పరిస్థితుల్లోనూ విరమించేది లేదని, డిమాండ్ పరిష్కారం కోసం చేపడుతున్న సమ్మె కొనసాగుతుందని, విధుల్లోకి చేరేది లేదని డీపీవోకు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేశారు.

గ్రామాల్లో పర్యవేక్షణ ఉంటుంది..

గ్రామాల్లో పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు డీపీఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జేపీఎస్, ఓపీఎస్‌లతో మాట్లాడగా.. సమ్మెకు మొగ్గు చూపారని, ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెగ్యులర్ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయంలోని జూనియర్, సీనియర్ అసిస్టెంట్, టైపిస్టులు, అవసరమైన సిబ్బందిని గ్రామాలకు పర్యవేక్షణ ఇంచార్జీలుగా నియమిస్తామని తెలిపారు. ఒక్కొక్కరికీ నాలుగు నుంచి ఆరు గ్రామాల చొప్పున ఇంచార్జీ బాధ్యతలు అప్పగించి గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పేర్కొన్నారు.

ధాన్యం దిగదు.. లారీ కదలదు

- గత ఏడాది యాసంగి ధాన్యం గోదాముల్లోనే
- ధాన్యం దించుకునేందుకు రైస్‌మిల్లర్ల నిరాకరణ
- వారం రోజులుగా రైస్‌మిల్లల వద్దే లారీలు



హాజీపూర్: ఓ రైస్‌మిల్లు వద్ద ధాన్యం లారీ

మంచిర్యాలఅగ్రికల్చర్: లారీల్లో నుంచి ధాన్యం దిగడం లేదు. ఫలితంగా వారం రోజులైనా లారీలు కదలడం లేదు. గత ఏడాది యాసంగి సీజన్ రైతుల నుంచి వివిధ ఏజెన్సీల ద్వారా సేకరించిన ధాన్యం ఇంటర్మీడియెట్ గోదాముల్లో నిల్వ చేశారు. కొద్ది రోజులుగా గోదాముల్లోని ధాన్యాన్ని జిల్లాలోని వివిధ రైస్‌మిల్లులకు కేటాయించారు. నెలాఖరులోగా గోదాముల్లోని ధాన్యం దించుకుని సీఎంఆర్ పూర్తి చేయాలని రైస్‌మిల్లర్లను ఆదేశించారు. కానీ గోదాముల నుంచి లోడింగ్‌తో రైస్‌మిల్లులకు వెళ్తున్న లారీ నుంచి ధాన్యం దించుకునేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు. బరువు తగ్గడం, తరుగు, నాణ్యత లేక పూర్తి స్థాయిలో సీఎంఆర్ రాక నష్టపోవాల్సి వస్తుందని అన్‌లోడ్ చేసుకోవడం లేదు. దీంతో వారం రోజుల నుంచి లారీల యజమానులు మిల్లు వద్ద వేచి చూస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అటు గోదాములకు తిరిగి వెళ్లలేక, ఇటు అన్‌లోడ్ కాక లారీలు రైస్‌మిల్లుల వద్దే ఉంటున్నాయి. వందల క్వింటాళ్ల ధాన్యం లోడుతో రైస్‌మిల్లుల వద్ద రోజుల తరబడి లారీ ఉండడంతో టైర్లు, బండి బాడీ పాడవుతుందని, కిరాయి రాక, డ్రైవర్‌కు జీతం ఇవ్వలేక నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు నష్టపోవాల్సి వస్తుందని, ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొందని అంటున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు

ప్రస్తుత యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతోంది. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోవాల్సి వస్తుందని, అయినా ధాన్యం తరలింపులో వేగవంతం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత యాసంగి ధాన్యం గోదాముల్లో నిండా ఉండడంతో ప్రస్తుతం సేకరిస్తున్న ధాన్యం గోదాముల్లోకి తరలించే పరిస్థితి లేదు. ఇటు మిల్లులకు కేటాయింపుల్లేక, అటు గోదాంలకు తరలించలేక ధాన్యం సేకరణలో ఆలస్యంపై ఆందోళన చెందుతున్నారు.

రోజు రూ.4 వేల వరకు నష్టం

గోదాముల్లోని ధాన్యం తరలించడానికి కోల్‌బెల్ట్ లారీలను కేటాయించారు. జిల్లా పౌరసరఫరాల, ట్రాన్స్‌పోర్ట్ అధికారుల సూచనతో రైస్‌మిల్లుకు తరలిస్తున్నాం. కానీ మిల్లర్లు దించుకోకపోవడంతో వారం పది రోజులు రైస్‌మిల్లుల వద్ద లారీలు పడిగాపులు కాయాల్సి వస్తుంది. లారీల కిరాయి, లోడ్‌తో రోజు తరబడి ఉంటే టైర్లు, బాడీ చెడిపోవడం, ఇలా రోజుకు రూ.4 వేల వరకు నష్టపోవాల్సి వస్తుంది. రైస్‌మిల్లర్లు లోడ్ దించుకునేలా చేయాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం ఉండడం లేదు.

– కోల్‌బెల్ట్ లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామ్‌దేని రమేష్

బ్యాడ్మింటన్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్
- 'సాక్షి' ఉచిత శిక్షణ ప్రారంభం



క్రీడాకారులతో మున్సిపల్ కమిషనర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి

మంచిర్యాలటౌన్: విద్యార్థులు బ్యాడ్మింటన్ ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రంగంపేటలో మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీ సహకారంతో సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ ఉచిత శిక్షణను శుక్రవారం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డితో కలిసి కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఏదో ఒక అంశంపై శిక్షణ పొందాలని తెలిపారు. కాగా, 6నుంచి 15ఏళ్లలోపు విద్యార్థులు నస్పూర్, క్యాతన్‌పల్లి, హాజీపూర్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో శిక్షణకు హాజరు కాగా, అకాడమీ వ్యవస్థాపకులు మధు, కోచ్ ప్రణీత్ బ్యాడ్మింటన్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గలవారు షటిల్ బ్యాట్‌తో హాజరు కావచ్చని తెలిపారు.

క్రీడలతోనే మానసిక దృఢత్వం



విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యం. క్రీడలతోనే మానసిక దృఢత్వం పెంపొందుతుంది. ఎక్కడ క్రీడలపై శిక్షణ అందించినా సద్వినియోగం చేసుకోవాలి. సాక్షి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం వల్ల ఎంతోమంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది.

– శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి

సరైన శిక్షణ



జిల్లాలో బ్యాడ్మింటన్‌లో సరైన శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపేందుకు మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీని ప్రారంభించాం. హర్ష స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌తో కలిసి బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇచ్చి క్రీడాకారులు అనుకున్న లక్ష్యాలను చేరేందుకు దోహదపడుతున్నాం.

– మధు, మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకులు

మందమర్రిలో యజ్ఞంలా అభివృద్ధి

- 1/70 యాక్ట్ తొలగిస్తే మరింత అభివృద్ధి
- రాష్ట్ర అటవీ, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీలో అభివృద్ధి యజ్ఞంలా సాగుతోందని, 1/70 యాక్టు తొలగిస్తే మరింత అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర అటవీ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో శుక్రవారం ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్యక్షతన మున్సిపల్ స్థాయి బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా ప్రత్యేక నిధులు తీసుకొచ్చి మందమర్రి మున్సిపాల్టీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.172.35 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే మరో రూ.20కోట్లు మంజూరవుతాయని అన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 1/70 యాక్ట్ అమల్లో ఉన్నందున కొన్ని అడ్డంకులు ఉన్నమాట వాస్తవమేనని, దాన్ని తొలగించడానికి కేంద్రంలో బీజేపీ సహకరించడం లేదని ఆరోపించారు. అభివృద్ధి విషయంలో కొన్ని పార్టీల నాయకులు అడ్డుపడడం సిగ్గుచేటని మండిపడ్డారు. సింగరేణి నష్టాల్లో ఉందని ప్రచారం చేస్తూ ప్రైవేట్ పరం చేసి అదానీకి అప్పగించాలని ప్రధాని నరేంద్రమోదీ చూస్తున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రధాని అయితే దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో అమలయ్యే పథకాలు, సంక్షేమ ఫలాలు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అమలవుతాయని వివరించారు. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బాల్క సుమన్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, గ్రంథాలయ జిల్లా చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జెంగిలి రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

బీజేపీ అడ్డుకునే ప్రయత్నం

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాన్వాయ్ మందమర్రికి వచ్చే క్రమంలో బీజేపీ నాయకులు పలువురు పాత బస్టాండ్ సమీపంలోని రైల్వేట్రాక్ దగ్గర నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. దీంతో సురేందర్, శ్రీనివాస్, మహేష్‌యాదవ్, ఓదెలును పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాస్తారోకో



ముత్యంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు

దండేపల్లి: వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మండలంలోని కొర్విచెల్మ, ముత్యంపేట గ్రామాల రైతులు శుక్రవారం ముత్యంపేట వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోతోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. తూకం వేసిన బస్తాలను త్వరగా మిల్లులకు తరలించాలని, వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఐకేపీ వీవోఏలు సమ్మెలో ఉన్నారని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు. డీటీ విజయ, ఆర్ఐ రంజిత్ రైతులతో మాట్లాడి సమస్యను డీసీఎస్‌వో దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోళ్లు వేగవంతం చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. రైతుల ఆందోళనకు వివిధ పార్టీల నాయకులు మద్దతుగా నిలిచారు. ఎస్సై ప్రసాద్, పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

'ఐకేపీ ఉద్యోగులపై సవతి తల్లి ప్రేమ తగదు'



దీక్షలో కూర్చున్న వినోద్‌నాయక్

జన్నారం: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ తగదని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్టుమెంట్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. శుక్రవారం జన్నారం మండలం కేంద్రంలో ఐకేపీ వీవోఏ నిరవధిక సమ్మెలో కూర్చుని కాంగ్రెస్ పార్టీ తరఫున సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3 వేల కోసం వీవోఏలు వెట్టి చాకిరీ చేస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అన్నారు. రాష్ట్రంలోని సమస్యలను గాలికి వదిలిన సీఎం మహారాష్ట్రలో పర్యటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, నాయకులు రమేష్, నరేశ్, అజార్, ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణపై తప్పుడు ప్రచారం'



మాట్లాడుతున్న రఘునాథ్‌రావు

శ్రీరాంపూర్: బొగ్గు గనుల ప్రైవేటీకరణపై సింగరేణిలో టీబీజీకేఎస్, బీఆర్ఎస్‌లు కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు విమర్శించారు. శుక్రవారం ఎస్సార్పీ 3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో బొగ్గు గనుల వేలంలో పాల్గొంటున్న సింగరేణి రాష్ట్రంలో జరిగే బొగ్గు బ్లాకుల వేలంలో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. ఈ బ్లాకులను కల్వకుంట్ల కుటుంబానికి అప్పగించడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను సింగరేణి ప్రాంతంలో ఖర్చు చేయకుండా ఇతర జిల్లాలకు తరలిస్తున్నారని తెలిపారు. 11వ వేతన ఒప్పందంలో బీఎంఎస్ వేజ్ బోర్డు సభ్యుడు కే.లక్ష్మారెడ్డి కృషి వల్లే నేడు 19 శాతం మినిమం గ్యారెంటీ బెన్‌ఫిట్ సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అగల్‌డ్యూటీ రాజు, నాయకులు బరుపటి మారుతి, కాదాసి భీమయ్య, వినోద్, సందీప్, రాజ్‌కుమార్, సత్రం రమేశ్, మిట్టపల్లి మొగిలి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు ఎద్దు మృతి

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారం గ్రామానికి చెందిన కురిమిల బక్కయ్యకు చెందిన ఎద్దు శుక్రవారం ఉదయం పిడుగుపాటుకు మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బక్కయ్య తన ఎద్దును ఇంటిముందు కట్టేసి ఉంచాడు. శుక్రవారం ఉదయం వర్షానికి పిడుగుపడి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.40వేల వరకు ఉంటుంది. పరిహారం అందజేసి ఆదుకోవాలని బక్కయ్య కోరాడు. పశువైద్యాధికారి దిలీప్ చనిపోయిన ఎద్దుకు పోస్టుమార్టం నిర్వహించారు.

1నుంచి ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాలు

పాతమంచిర్యాల: తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా లేబర్ కార్డులు పొందిన నిర్మాణ రంగాల కార్మికుల కోసం మే 1,2,3 తేదీల్లో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఏఎస్ వినీత ఓ ప్రకటనలో తెలిపారు. మే 1న చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయం, 2న లక్సెట్టిపేటలోని ఉత్కూర్ పాత గ్రామపంచాయతీ కార్యాలయం, 3న బెల్లంపల్లిలోని తిరుమల తిరుపతి కల్యాణ మండపం రామాలయం దగ్గర శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లేబర్ కార్డు కలిగిన నిర్మాణ రంగాల్లో ఉన్న ప్రతీ కార్మికుడు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో యువ రైతు మృతి


రవి (ఫైల్)

నెన్నెల: మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన రైతు దుగుట రవి (40) గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రవి ఎకరంలో ఆడ, మగ వరి సాగుచేశాడు. మరో ఎకరా మామిడి తోట ఉంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మామిడి కాయలన్నీ నేల రాలాయి. వరి పంటకు స్వల్ప నష్టం కలిగింది. గురువారం భార్య గంగాదేవితో కలిసి పొలానికి వెళ్లి దెబ్బతిన్న పంటను చూస్తున్న రవికి హఠాత్తుగా గుండె నొప్పి వచ్చింది. వెంటనే అతడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతినగా పెట్టుబడి డబ్బులు కూడా తిరిగి రావేమోనని రవి తరచూ మనస్తాపం చెందేవాడని అతడి భార్య తెలిపింది. తన కుటుంబాన్ని ప్రభుత్వంతోపాటు ఆడ, మగ వరి విత్తనాలు సరఫరా చేసిన కంపెనీ ఆదుకోవాలని వేడుకుంది. కాగా, రవికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలున్నారు.

పులిదాడిలో ఆవుకు గాయాలు

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ అటవీప్రాంతంలోకి మేతకు వెళ్లిన తలండి నారాయణకు చెందిన ఆవుపై శుక్రవారం పులిదాడి చేయగా తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది పులిదాడిగా నిర్ధారించారు. అటవీప్రాంతంలోకి వెళ్లవద్దని గ్రామస్తులకు సూచించారు.

జోరుగా నల్లబెల్లం దందా


బాక్స్‌ల్లో పట్టుబడిన నల్ల బెల్లం

బెల్లంపల్లి: నల్లబెల్లం అక్రమ దందాకు బెల్లంపల్లి కేరాఫ్‌గా మారుతోంది. కొందరు వ్యాపారులు నిషేధిత నల్లబెల్లం, పటికతో అక్రమ వ్యాపారానికి తెరతీశారు. కొంత కాలంగా బాహాటంగానే నల్లబెల్లం, పటిక క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా గుడుంబా తయారీ కోసం ప్రభుత్వం నిషేధించిన నల్లబెల్లం అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల వారీగా గుడుంబా తయారీదారులతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని అక్రమ దందా నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అడ్డూఅదుపు లేకుండా టన్నుల కొద్దీ నల్ల బెల్లాన్ని దిగుమతి చేసుకుని రహస్యంగా గోదాముల్లో నిల్వ ఉంచి దందా సాగిస్తున్నారు. నిషేధిత నల్లబెల్లం అమ్మకాలను నియంత్రించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి.

- కిరాణాలు, గోదాముల్లో భారీ నిల్వలు
- బెల్లంతో సమానంగా పటిక విక్రయాలు
- యథేచ్ఛగా సాగుతున్న అక్రమ దందా
- కుటీర పరిశ్రమగా గుడుంబా తయారీ

వాణిజ్య కేంద్రం కావడంతో..
చుట్టు పక్కలున్న ఎనిమిది మండలాలకు ప్రధాన వాణిజ్య పట్టణంగా బెల్లంపల్లి విరాజిల్లుతోంది. నెన్నెల, భీమిని, కన్నెపల్లి, తాండూరు, వేమనపల్లి, కాసిపేట, బెల్లంపల్లి గ్రామీణ ప్రాంతంతోపాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి, దహెగాం మండలాలకు చెందిన వేలాదిమంది రోజువారీగా బెల్లంపల్లికి వస్తుంటారు. ఇక్కడ రిటైల్, హోల్‌సెల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇదే అదనుగా భావించి కొందరు కిరాణా షాపుల నిర్వాహకులుగా చెబుతూ బెల్లం, పటిక కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. దినసరి సరుకుల మాటున కొందరు వ్యాపారులు గ్రామాలకు పెద్ద మొత్తంలో సరఫరా చేసి అక్రమదందా సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా గురువారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పక్కా సమాచారంతో పాత బస్టాండ్‌లో ఉన్న ఓ కిరాణా షాపు, షాపు నిర్వాహకుడికి సంబంధించిన గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేయగా భారీగా నల్లబెల్లం నిల్వలు పట్టుబడ్డాయి. వ్యాపారులు బెల్లంతో సమానంగా పటిక కూడా విక్రయిస్తుండడం గమనార్హం.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



నిషేధిత నల్లబెల్లం క్రయవిక్రయాలపై ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నాం. ప్రజల అవసరాలకు అనుగుణంగా మాత్రమే నిల్వలుండాలి. అక్రమంగా క్వింటాళ్ల కొద్దీ గోదాంలలో నిల్వ ఉంచుకోవడం నేరం. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం అక్రమంగా నల్లబెల్లం, పటిక విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. రోజువారీగా షాపుల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తాం.
– డీ దీపక్, ఎక్సైజ్ సీఐ, బెల్లంపల్లి

కొరవడిన నిఘా..
గుడుంబా తయారీ స్వరూపం పూర్తిగా మారిపోయింది. దశాబ్దాల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో ఎండాకాలంలో ఇప్పచెట్ల కింద రాలిన ఇప్పపూవు సేకరించి ఇండ్లలో నిల్వ చేసుకునేవారు. వ్యవసాయ పనులు, ఇతర కూలీ పనులకు వెళ్లేవారు ఉపశమనం కోసం ఇప్పపూవుతో సారా తయారు చేసుకుని సేవించేవారు. కాలక్రమేణా ఇప్పపూవు సేకరణ తగ్గుముఖం పట్టడంతో నాటుసారా తయారీదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకున్నారు. కుళ్లిన పండ్లు, అరటి తొక్కలు, పాత చెప్పులు తదితర వ్యర్థాలతో కిక్కు ఎక్కువ రావడానికి పటిక, నల్లబెల్లాన్నీ కలిపి గుడుంబా తయారు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం ఇప్పపూవు లేకుండానే గుడుంబా తయారు చేయడం కుటీర పరిశ్రమగా మారింది. హానికరమైన పదార్థాలతో నాటుసారా తయారు చేసి ప్యాకెట్లుగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలించడమే కాకుండా మద్యం ప్రియులకు విక్రయిస్తున్నారు. గుడుంబా నియంత్రణలో భాగంగా ప్రభుత్వం నల్లబెల్లం అమ్మకాలపై నియంత్రణ విధించింది. వ్యాపారులు పెద్ద మొత్తంలో కాకుండా ప్రజా అవసరాలకు సరిపడా నల్లబెల్లం నిల్వ ఉంచుకోవాలని నిబంధన విధించినా కొందరు వ్యాపారులు పెడచెవిన పెట్టి అక్రమ దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర సరుకుల కన్నా నల్లబెల్లం విక్రయాలు ఎక్కువగా ఉండడంతో వారంలో రెండుసార్లు బెల్లం, పటికను టన్నుల కొద్దీ దిగుమతి చేసుకుని విక్రయాలు చేస్తుండడం పరిపాటిగా మారింది. నెలకు గరిష్టంగా 50 నుంచి 100 టన్నులకు పైగా నల్లబెల్లం క్రయవిక్రయాలు సాగుతున్నట్లు అంచనా. అక్రమంగా సాగుతున్న పటిక, నల్లబెల్లం అమ్మకాలపై నిఘా పెట్టి దందా సాగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతుడి శరీరంపై బ్లూ కలర్ ప్యాంట్, నలుపు.. ఆరెంజ్ కలర్ టీ షర్ట్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యుత్ స్తంభానికి బైక్ ఢీకొని ఒకరి మృతి


నితీశ్ (ఫైల్)

బెజ్జూర్: విద్యుత్ స్తంభానికి బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుక్కుడ గ్రామానికి చెందిన కళాంగిరికి ఇద్దరు కుమారులు నితీశ్ (16), యశ్వంత్ ఉన్నారు. నితీశ్ సలుగుపెల్లి ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి, యశ్వంత్ ఉట్నూర్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వేసవి సెలవులకు వీరు ఇంటికి వచ్చారు. నితీశ్ యశ్వంత్‌కు బైక్ డ్రైవింగ్ నేర్పించేందుకు కోర్తగుడ గ్రామం వైపు ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లాడు. డ్రైవింగ్ నేర్పిస్తుండగా ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నితీశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. యశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి కళాంగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పోలీసుల అదుపులో ఉన్న యువకుడిని విడుదల చేయాలి

పెంచికల్‌పేట్: పోలీసుల అదుపులో ఉన్న మురళీగూడ గ్రామానికి చెందిన కోట ఆనంద్‌ను వెంటనే విడుదల చేయాలని ఆదివాసీ గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోట సతీశ్, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న ఆనంద్‌ను పోలీసులు అక్రమంగా బంధించి తీసుకువెళ్లారని తెలిపారు. ఎలాంటి హాని తలపెట్టకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మైనింగ్ స్టాఫ్‌కు సూటబుల్ జాబ్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు

శ్రీరాంపూర్: అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్‌కు సూటబుల్ జాబ్ ఇవ్వాలని ఏఐటీయూసీ మైనింగ్‌స్టాఫ్ సబ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు, శ్రీరాంపూర్ డివిజన్ ఇన్‌చార్జి మారపెల్లి బాపు మాట్లాడారు. యాజమాన్యం స్పందించి వెంటనే ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేకే యైటింక్లయిన్ గనిలో డిస్మిస్ సాదుల ప్రకాశ్ అనే ఓవర్‌మన్‌కు న్యాయం చేయాలని తాము భూపాలపల్లిలో ఆందోళనలు చేయగా ఆరోజు డైరెక్టర్ బలరాం వచ్చి న్యాయం చేస్తామని అతడికి ఉద్యోగం ఇచ్చారని తెలిపారు. దీనికి తాము డైరెక్టర్ బలరాంకు మైనింగ్ స్టాఫ్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. దీనితోపాటు ఇతర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. ఓసీపీలు, సర్ఫేస్‌లో ఖాళీగా ఉన్న మైనింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మందమర్రి బ్రాంచ్ ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ, నాయకులు చంద్రశేఖర్, శెట్టి శంకరయ్య, బీ సదయ్య, సాయిబాబా, పవన్‌కుమార్, సాజిత్, రాజేశ్ పాల్గొన్నారు.

ఇందారం ఓసీపీ సందర్శన


ఇందారం ఓపెన్‌కాస్టు గనిని సందర్శిస్తున్న డైరెక్టర్

జైపూర్: ఇందారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్ట్‌ను శుక్రవారం సంస్థ డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. గోదావరి ఒడ్డున నిర్మించిన కరకట్టను పరిశీలించారు. ఓసీపీ పక్కనున్న గోదావరి కరకట్ట రక్షణ చర్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. వచ్చేది వానాకాలం కావడంతో ముందస్తు చర్యలు చేపట్టాలని, క్వారీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గని మేనేజర్ రవికుమార్, ఆపరేషన్ మేనేజర్ బ్రహ్మాజీరావు, డీజీఎం శివరావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ రమేశ్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్ హాల్ ప్రారంభం


కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ ఆవరణలో రూ.20లక్షలతో నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్‌ను శుక్రవారం కంపెనీ డైరెక్టర్ (పీపీ) జీ వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధునాతన వసతులతో నిర్మించిన కాన్ఫరెన్స్‌హాల్ అధికారులు సమీక్షలు నిర్వహించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి, ఎస్వోటూ జీఎం త్యాగరాజు, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏజెంట్ గోపాల్‌సింగ్, డీజీఎంలు అరవిందరావు, శివరావు, ఎస్టేట్స్ వరలక్ష్మి, టీబీజీకేఎస్ నాయకులు డీ అన్నయ్య, పెట్టం లక్ష్మణ్, వెంగల కుమారస్వామి, పిట్ సెక్రటరీ పీవీ రావు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో చోరీ జరిగింది. పట్టణ ఎస్సై తైసీనొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌లో నివాసముంటున్న కనకాల రాజనర్సు ఈ నెల 27న రామకృష్ణాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికిరాగా మెయిన్ డోర్ తెరిచి ఉంది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బట్టలు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. 21 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశాడు.

ఆరోగ్య ఉపకేంద్రం పరిశీలన

మందమర్రిరూరల్: పొన్నారం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేడ్ శుక్రవారం పరిశీలించారు. రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచ టీకాల వారోత్సవాల్లో భాగంగా వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అయ్యేలా చూడాలన్నారు. సిబ్బంది శ్యామల పాటిల్, గ్లోరీ, సుజాత, స్వప్న ఉన్నారు.

రెండురోజుల్లో అనుమతి పత్రాలు చూపించాలి


బంక్‌ను పరిశీలిస్తున్న ప్రేమ్‌కుమార్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మై వోస్ ఎకో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అవుట్‌లెట్ డీజిల్ బంక్‌ను డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. బంక్‌పై వచ్చిన ఫిర్యాదుల దృష్ట్యా రికార్డులు తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేవని తెలియడంతో వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజుల్లో పూర్తి ధ్రువీకరణ పత్రాలు చూపించాలని బంక్ యజమానులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోత్స్న, టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.

నవోదయ పిలుస్తోంది..!


కాగజ్‌నగర్ కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయం

- ఆరోతరగతిలో ప్రవేశానికి నేడు పరీక్ష
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాయనున్న 5,920 మంది విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ, అక్షరాస్యత, పాఠశాల విద్యా విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్రీయ జవహర్ నవోదయలో ప్రవేశానికి శనివారం నిర్వహించనున్న పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2023–24కు విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 5,920 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఆరో తరగతిలో 80 సీట్ల భర్తీకి ఉమ్మడి జిల్లాను 14 బ్లాక్‌లుగా విభజించారు. ఆయా బ్లాక్‌లలో 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రంలో 130 మందికి పైగా, గరిష్టంగా 360 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్ష ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కొనసాగనుంది. విద్యార్థులు ఉదయం 11గంటలలోపే కేంద్రాలకు చేరుకోవాలి. 11.30 తర్వాత వచ్చేవారిని అనుమతించరు. విద్యార్థులు హాల్‌టికెట్, వాటర్ బాటిల్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. ఎలక్ట్రానిక్స్ పరికరాలు అనుమతించరు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది పరీక్ష రాసినవారు ఎనిమిది మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారికి ఈసారి అఫిడవిట్ అవకాశం కల్పించారు. ప్రిన్సిపాల్ ద్వారా అందించే అడ్మిట్ కార్డు ఆధారంగానే వారు పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



శనివారం జరిగే నవోదయ ప్రవేశ పరీక్ష కోసం విద్యాలయ సమితి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి జిల్లాలోని ఎస్పీలకు బందోబస్తు కోసం దరఖాస్తు చేశాం. కలెక్టర్లకు ఫ్లయింగ్ స్క్వాడ్ కోసం నివేదించాం. పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్లు, పరిశీలకులను నియమించాం. ఆన్‌లైన్ ద్వారా నలుగురు విద్యార్థులు తప్పుగా దరఖాస్తు చేసినట్లు తెలిసింది. వీరు ఈ పరీక్ష రాసేందుకు అనర్హులు.
– బీ చక్రపాణి, ప్రిన్సిపాల్

రిజర్వేషన్లు ఇలా...
- కనీసం 75 శాతం సీట్లు జిల్లాలోని గ్రామీణ విద్యార్థులతో భర్తీ చేస్తారు.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగ విద్యార్థుల కోసం రిజర్వేషన్లు ఉన్నాయి.
- బాలికల కోసం కనీసం 1/3 వంతు సీట్లు కేటాయించబడ్డాయి.

విద్యాలయం ప్రత్యేకతలు
- జిల్లా విద్యాలయంలో సహవిద్య, ఆవాసీయ పాఠశాల
- బాలబాలికల కోసం ప్రత్యేకమైన హాస్టళ్లు
- ఉచిత విద్య, భోజన సదుపాయం
- మైగ్రేషన్ పథకం ద్వారా విస్తృతమైన సాంస్కృతిక వినిమయం
- స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వృద్ధి
- ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్
- నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా ఉత్తమ ఫలితాల సాధన
- జేఈఈ మెయిన్స్.. అడ్వాన్స్‌డ్, నీట్ లాంటి ఉన్నత పరీక్ష ఫలితాల్లో నవోదయ విద్యార్థులు ప్రతిభ కనబర్చిన విషయం తెలిసిందే.
- 10వ తరగతి, ఇంటర్ బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు.

కులదేవతలకు పూజలు


వాల్గొండలో కుల దేవతలకు పూజలు చేస్తున్న ఆదివాసీలు


వాల్గొండలో జంగుబాయి దేవతకు మొక్కుతున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో వైశాఖ(బావై) మాసాన్ని పురస్కరించుకుని కుల దేవతలకు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని వాల్గొండ గ్రామంలో కినక వంశీయులు జంగుబాయి దేవత, మడావి వంశీయులు భీమల్ దేవుడి పూజలు చేశారు. రాత్రి మహా పూజ నిర్వహించి దేవతలకు మొక్కులు చెల్లించారు. ఇందులో జంగుబాయి దేవత పూజారి కినక శంభు, భీమల్ దేవుడి పూజారి మడావి శ్యామ్‌రావ్‌తో పాటు గ్రామ పటేల్ కినక లచ్చు, సర్పంచ్ కినక జుగాదిరావ్, గ్రామ పెద్దలు మెస్రం సోమేశ్వర్, మెస్రం జల్పత్‌రావ్, దుర్వ చంపత్‌రావ్, ఆత్రం గణపతి, ఆర్క యాదవ్‌రావ్, పెందోర్ దేవ్‌రావ్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

లక్సెట్టిపేట: గంపలపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, న్యూడెమోక్రసీ కార్యదర్శి దొండ ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షాలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తోందని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే కోతలు విధించకుండా కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు శంకరి సత్యం, కిష్టయ్య, మల్లేశ్, తిరుపతి, రవి పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్ పహాడ్ ఎంఎల్ఎస్ (మండల్ లెవల్ స్టాకిస్ట్) పాయింట్‌ను సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులు పరిశీలించారు. పీడీఎస్ బియ్యం నాణ్యతను తెలుసుకున్నారు. రెగ్యులర్ తనిఖీలా? లేదా మరేదైన సమాచారం సేకరించేందుకు ఉన్నతాధికారులు వచ్చారా? అనేది తెలియాల్సి ఉంది.